TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-177 | పేజీలు:-4 | బుధవారం 10-06-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## మీ తాటాకు చప్పుళ్లకు భయపడేదిలేదు

- రేవంత్ రెడ్డి టార్గెట్‌గా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు..
- తెలంగాణలో మంత్రులు హైదరాబాద్ లో భూములు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు
- సీఎం రేవంత్ తనపై చేస్తున్న ఆరోపణల్ని నిరూపించాలని సవాల్ విసిరారు.




తెలంగాణ రాజకీయాలు కాకరేపుతున్నాయి. గత కొన్ని రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి టార్గెట్గా అనేక ఆరోపణలు చేస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

### దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్



- అభద్రతా భావంతో రేవంత్ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారన్న కిషన్ రెడ్డి
- రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చకు రావాలని సవాల్
- ఒక్క ప్రాజెక్టును అడ్డుకున్నట్టు నిరూపించినా రాజీనామా చేస్తానన్న కిషన్ రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై,- మిగతా 2 లో

### మేము 18 గంటలు కష్టపడుతుంటే హరీష్ రావు అబద్ధాలు చెబుతున్నారు



- రాష్ట్ర కేబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తోందన్న భట్టి
- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దివాలా తీయించిందని మండిపాటు
- తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 76 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వెల్లడి

తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ నాయకులపై, ముఖ్యంగా మాజీ మంత్రి - మిగతా 2 లో

### పీఓకేలో రక్తపాతం పాక్‌పై అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలి

- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో చెలరేగిన హింస.. 30 మంది మృతి
- చౌకగా పిండి, విద్యుత్ కోరుతూ ప్రజల ఆందోళనలు
- ఘటనను తీవ్రంగా ఖండించిన భారత్
- పాక్‌ను అంతర్జాతీయ సమాజం నిలదీయాలని పిలుపు
- ప్రజలపై పాక్ బలగాల ఊచకోత అని ఆరోపణలు



పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని రావల్‌కోట్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘర్షణల్లో పౌరులు మరణించడంపై భారత్ తీవ్రంగా స్పందించింది. నిరసనకారులపై పాకిస్థాన్ సాగించిన అణచివేత చర్యలకు గానూ, ఆ దేశాన్ని అంతర్జాతీయ సమాజం జవాబుదారీని చేయాలని ఆశిస్తున్నట్లు - మిగతా 2 లో

### అది పవిత్ర రంజాన్ మాసంలో జరిగిన నరమేధం

ఐరాసలో పాక్‌ను ఏకిపారేసిన భారత్

- ఆఫ్ఘనిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులను తీవ్రంగా ఖండించిన భారత్
- ఇది ఆఫ్ఘన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడిగా వ్యాఖ్య
- సామాన్య పౌరుల మరణాలపై ఐరాస వేదికగా ఆందోళన
- ఐరాస నివేదికలనే ప్రశ్నించడంపై పాకిస్థాన్‌కు చురకలు
- రంజాన్ మాసంలో పౌరుల మరణాలపై స్వతంత్ర దర్యాప్తునకు డిమాండ్




ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ సైన్యం జరిపిన వైమానిక దాడులను తీవ్రంగా ఖండించింది. ఈ చర్య ఆఫ్ఘనిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన స్పష్టమైన దాడి అని, ఇది ఆ దేశంతో పాటు యావత్ ప్రాంతీయ శాంతికి- మిగతా 2 లో

## రూ. 13,000 కోట్లతో గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్టు

కేంద్ర ప్రభుత్వం ఆమోదం

దేశ సహజ, గిరిజన వారసత్వ సంపదను ధ్వంసం చేయడమే ప్రాజెక్టుపై ప్రతిపక్షాల తీవ్ర ఆగ్రహం




ఐఎన్ఎస్ బాజ్ వద్ద ఉన్న నావికాదళ విమానాశ్రయాన్ని విస్తరించడానికి బదులుగా గ్రేట్ నికోబార్ ప్రాజెక్టులో భాగంగా రూ. 13,000 కోట్ల వ్యయంతో కొత్తగా పౌర-సైనిక వినియోగ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పర్యావరణపరంగా సున్నితమైన దీవిలో రూ. 81,000 కోట్ల భారీ అభివృద్ధి ప్రాజెక్టుపై రాజకీయ పోరు తీవ్రమవుతున్న తరుణంలో

### పశ్చిమ బెంగాల్‌లో పార్టీలో సంక్షోభం

తృణమూల్ కాంగ్రెస్ ఏమన్నదంటే?



- మమత నాయకత్వాన్ని పొగిడినవారే, ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన
- ఇది అధికారం కోసం చేస్తున్న ద్రోహమని టీఎంసీ చీఫ్ విప్ వ్యాఖ్య
- తృణమూల్ కాంగ్రెస్‌లో తీవ్రమైన అంతర్గత సంక్షోభం
- ఎన్డీఏకు మద్దతిస్తామంటూ 20 మంది ఎంపీల తిరుగుబాటు

పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుత పరిణామాలపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) స్పందించింది. టీఎంసీ - మిగతా 2 లో

### ఢిల్లీ అగ్నిప్రమాదం కుటుంబంలోని 8 మంది మృతి



- తన వాళ్లు ఇక లేరని తెలియని వృద్ధుడు కూడా కన్నుమూత
- ఢిల్లీ హోటల్ అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి
- ఆసుపత్రిలో ఉన్న కుటుంబ పెద్దను చూసేందుకు వచ్చి ప్రమాదంలో చిక్కుకున్న బంధువులు

ఈ విషయం తెలియకుండానే, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు కన్నుమూత - మిగతా 2 లో

### నారా లోకేష్ రష్యా పర్యటనపై జాతీయ మీడియాలో ప్రత్యేక కథనం



- లోకేష్ రష్యా పర్యటనపై 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం
- సెయింట్ పీటర్స్‌బర్గ్ ఆర్థిక వేదికలో పాల్గొన్న మంత్రి లోకేష్
- ఏఐ, స్మార్ట్ సిటీలు, తయారీ రంగాల్లో పెట్టుబడుల కోసం చర్చలు
- తిరుపతి స్పేస్ సిటీ ప్రాజెక్టును రష్యా వేదికగా ప్రమోట్ చేసిన లోకేష్
- తక్షణ ఒప్పందాలు లేనప్పటికీ భవిష్యత్ సహకారానికి బలమైన పునాది

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి - మిగతా 2 లో

## వృద్ధి రేటు పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్

- పనితీరు ఆధారంగా శాఖలకు స్కోరింగ్
- వివిధ శాఖలకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నిర్దేశించిన సీఎం
- పనితీరు ఆధారంగా స్కోరింగ్ విధానం అమలుకు నిర్ణయం
- ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికల రూపకల్పన
- ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ ఫోర్స్ ఏర్పాటుపై ఆలోచన
- 2047 స్వర్ణాంధ్ర లక్ష్య సాధన కోసం డేటా ఆధారిత పాలనపై దృష్టి




ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు, వృద్ధి రేటును పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)

### వైసీపీ 'శవ రాజకీయాలు' చేస్తోంది



- విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించిందన్న నారాయణ
- సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్ ఘటనను పర్యవేక్షిస్తున్నారని వెల్లడి
- 2029 ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు మళ్లీ గుణపాఠం చెబుతారని హెచ్చరిక

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించిందని మున్సిపల్ పరిపాలన - మిగతా 2 లో

## వృద్ధి రేటు పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్

మొదటిపేజీ తరువాయి – లక్ష్యాలు, ప్రభుత్వ శాఖల పనితీరును కొలిచే కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల (కేపీఐ)పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వివిధ శాఖలకు కేపీఐలను సీఎం నిర్దేశించారు. జాతీయ సగటు కంటే వెనుకబడిన సూచికలను మెరుగుపరచడమే కాకుండా, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. కేవలం నిర్దేశిత లక్ష్యాలే కాకుండా, వాస్తవ వృద్ధి (రియల్ గ్రోత్) ఆధారంగా శాఖల పనితీరును అంచనా వేసేందుకు స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని సీఎం నిర్ణయించారు. రాష్ట్ర, క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను ఎప్పటికప్పుడు విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలపై పెట్టే వ్యయం, ఆర్థిక కార్యకలాపాలను 3.5 రెట్లు పెంచేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఆర్థిక వ్యవహారాలను రియల్ టైంలో పర్యవేక్షించేందుకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలనే ఆలోచనను కూడా పంచుకున్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా ఆధారిత పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. అమరావతి, పోలవరం, పోర్టులు, ఎయిర్‌పోర్టుల వంటి కీలక ప్రాజెక్టులతో ఆర్థిక వ్యవస్థకు 'మల్టిప్లైయర్ ఎఫెక్ట్' తీసుకురావాలని సూచించారు. కేపీఐలు మెరుగ్గా ఉంటేనే రాష్ట్ర వృద్ధి రేటు పెరుగుతుందని, ప్రతి రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్ (జీవీఏ) పెంపుపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి అన్నారు.

## వైసీపీ 'శవ రాజకీయాలు' చేస్తోంది

మొదటిపేజీ తరువాయి – శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్న ఆయన, ఈ ప్రమాదం నేపథ్యంలో తాను తిరుపతిలో పాల్గొనాల్సిన అధికారిక కార్యక్రమాన్ని కూడా రద్దు చేసుకున్నట్లు వివరించారు. బాధితులకు మెరుగైన వైద్యం, తక్షణ సహాయక చర్యలు అందించడంపైనే ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ ఘటనను పర్యవేక్షిస్తున్నారని నారాయణ పేర్కొన్నారు. అయితే, ఈ విషాదాన్ని ఆసరాగా చేసుకుని వైసీపీ దారుణమైన శవ రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికిన ఆయన, 2029 ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు మళ్లీ తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇక గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన 56 ఫిర్యాదుల్లో 60 శాతానికి పైగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకల వల్లే ప్రజలు నేటికీ ఇబ్బందులు పడుతున్నారని, వీటి పరిష్కారానికి మంత్రుల కమిటీ పనిచేస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు వారానికోసారి దీనిపై సమీక్ష నిర్వహిస్తున్నారని, వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు.


## దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

మొదటిపేజీ తరువాయి – కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... అహంకారం, అభద్రతా భావం, తీవ్ర నిరాశతోనే రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు, తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. “కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందంటే అది రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీల దయాదాక్షిణ్యాల వల్లేమీ కాదు. నేను అంబర్‌పేట్, సికింద్రాబాద్ ప్రజల ఆశీస్సులతో ఢిల్లీకి వెళ్లాను. రేవంత్ రెడ్డికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణ ప్రజలకు, నా నియోజకవర్గానికి, నా పార్టీకి మాత్రమే నేను జవాబుదారీని” అని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. “రేవంత్ రెడ్డికి దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి. ప్రెస్ క్లబ్ అయినా సరే లేదా అమరవీరుల స్తూపం ముందైనా సరే నేను చర్చకు సిద్ధం” అని ప్రకటించారు. తాను తెలంగాణకు రావాల్సిన ఏ ఒక్క ప్రాజెక్టునైనా అడ్డుకున్నానని నిరూపిస్తే తక్షణమే రాజీనామా చేస్తానని, దీనిపై సీనియర్ జర్నలిస్టులతో ఒక కమిటీని వేసి విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, మెట్రో ఫేజ్–2 పై సీఎం చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మెట్రో ఫేజ్–2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. తుమ్మిడిహట్టి అపాయింట్‌మెంట్ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ఆధారాలు లేని ఆరోపణలు మానేసి, పద్ధతిగా అధికారికంగా అపాయింట్‌మెంట్ కోరాలని సూచించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ అవినీతి, తప్పుడు నిర్వహణతో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

## మేము 18 గంటలు కష్టపడుతుంటే హరీష్ రావు అబద్ధాలు చెబుతున్నారు

మొదటిపేజీ తరువాయి – హరీష్ రావుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వరంగల్ జిల్లా చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తుంటే... హరీష్ రావు మాత్రం అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. “రాష్ట్ర క్యాబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తుంటే.. హరీష్ రావు నిత్యం అబద్ధాలు చెబుతున్నారు” అని భట్టి విమర్శించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుని, దివాలా తీయించిందని ఆయన ఆరోపించారు. మరి నాడు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వ విజయాలను ఆయన పంచుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే 76,000 ప్రభుత్వ ఉద్యోగాలు అందించిందని, రైతులకు అండగా నిలుస్తూ తడిసిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తోందని తెలిపారు. అలాగే రుణమాఫీ పథకాన్ని నిలకడగా అమలు చేస్తున్నామని చెప్పారు.బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన దేవాదుల ప్రాజెక్టును తాము వేగవంతం చేశామన్నారు. గత ప్రభుత్వం డిస్కమ్‌లకు బకాయిలు పెట్టడం వల్లే విద్యుత్ సమస్యలు వచ్చాయని, తాము ఆ బకాయిలను చెల్లిస్తూ విద్యుత్ సరఫరాను మెరుగుపరిచామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నామని చెప్పారు. రఘునాథపల్లిలో 230 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

## ఢిల్లీ అగ్నిప్రమాదం కుటుంబంలోని 8 మంది మృతి



మొదటిపేజీ తరువాయి – ప్రమాదంతో గుర్గావ్ అగర్వాల్ కుటుంబంలో ఎవరూ మిగలకుండా పోయిన వైనం హోటల్ యాజమాని, వంట మనిషిని అరెస్ట్ చేసిన పోలీసులు ఢిల్లీలో ఇటీవల జరిగిన ఘోర అగ్నిప్రమాద విషాదంలో మరో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తన కుటుంబ సభ్యులు ఎనిమిది మందిని కోల్పోయిన 80 ఏళ్ల రాధే శ్యామ్ అగర్వాల్, ఆ చేదు నిజం తెలియకుండానే మంగళవారం కన్నుమూశారు. దీంతో గురుగ్రామ్‌కు చెందిన అగర్వాల్ కుటుంబం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న రాధే శ్యామ్ అగర్వాల్ ఢిల్లీలోని సాకేత్ మాక్స్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆయన్ను చూసుకునేందుకు గురుగ్రామ్‌లో నివసించే ఆయన కుమారుడు వివేక్ అగర్వాల్, కోడలు, మనవరాళ్లతో సహా మొత్తం ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఢిల్లీకి వచ్చారు. వీరంతా ఆసుపత్రికి సమీపంలోని మాల్వియా నగర్‌లో ఉన్న 'ఫ్లరిష్ స్టే' అనే హోటల్‌లో బస చేశారు. జూన్ 3న ఉదయం 8:30 గంటల సమయంలో ఆ హోటల్‌లోని వంటగదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వివేక్ అగర్వాల్ కుటుంబ సభ్యులు ఎనిమిది మందితో పాటు మొత్తం 21 మంది ప్రాణాలు కోల్పోయారు. తన కుటుంబానికి ఇంతటి ఘోరం జరిగిందన్న విషయం తెలియని రాధే శ్యామ్, తన వాళ్లెవరూ పలకరించడానికి రావడం లేదని ఆసుపత్రి సిబ్బందిని నిరంతరం ఆరా తీస్తుండేవారు. చివరకు ఆయన కూడా చికిత్స పొందుతూ మృతి చెందడంతో, ఆ కుటుంబంలో ఒక్కరు కూడా మిగలకుండా పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు, హోటల్ యజమాని లవకేశ్ బజాజ్, వంట మనిషి కేశవ్ నేగిని అరెస్ట్ చేశారు. భవన నిర్మాణం, అగ్నిమాపక భద్రతా నిబంధనల్లో తీవ్ర లోపాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ దుర్ఘటనతో గురుగ్రామ్‌లోని అగర్వాల్ కుటుంబ నివాసం మూగబోయింది.

# నారా లోకేష్ రష్యా పర్యటనపై జాతీయ మీడియాలో ప్రత్యేక కథనం

మొదటిపేజీ తరువాయి – నారా లోకేష్ ఇటీవలే రష్యాలో జరిపిన పర్యటన, దాని ఫలితాలపై ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది న్యూ ఇండియన్ ఎక్స్ ప్రెస్' జూన్ 9న ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పరిశ్రమలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రవాణా, తయారీ, టెక్నాలజీ, స్మార్ట్ సిటీల వంటి కీలక రంగాల్లో కొత్త అవకాశాలు లభించనున్నాయని ఆ కథనం విశ్లేషించింది. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆర్థిక వేదిక 2026 సదస్సులో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రష్యా ప్రభుత్వ ప్రతినిధులు, ప్రముఖ కంపెనీలతో ఆయన ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో అల్యూమినా స్మెల్టర్ ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టిన 'రుసాల్' (=ఖూాూా) వంటి సంస్థలతో ఉన్న భాగస్వామ్యాన్ని సమీక్షించారు. అల్యూమినియం విలువ ఆధారిత ఉత్పత్తులు, ఆటోమోటివ్, ఏరోస్పేస్ మిశ్రమ లోహాలు, ఫాయిల్ ఉత్పత్తి వంటి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై చర్చించారు. పర్యటనలో భాగంగా ఇంధనం, లాజిస్టిక్స్, రవాణా, రైల్వేల తయారీ, క్రిటికల్ మినరల్స్, సెమీకండక్టర్లు, డిజిటల్ మౌలిక సదుపాయాల వంటి అనేక రంగాలకు చెందిన ప్రతినిధులతో లోకేష్ సమావేశమయ్యారు. ముఖ్యంగా, మాస్కో రవాణా శాఖ మంత్రి, వైస్ మేయర్ మాగ్జిమ్ లిక్సుటోవ్‌తో భేటీ అయి, ఏఐ ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలు, స్మార్ట్ రవాణా పరిష్కారాలపై చర్చించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ అధికారులతో సురక్షితమైన, స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల నిర్మాణంలో సహకారం గురించి మాట్లాడారు. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి అంశాలకు ఈ పర్యటనలో పెద్దపీట వేశారు. రష్యాకు చెందిన ప్రముఖ 'స్బేర్‌బ్యాంక్' (రాఎవతీఘెఅని) నాయకత్వంతో ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఆవిష్కరణలపై చర్చలు జరిపారు. 'స్కూల్ 21', 'స్బేర్‌సిటీ' వంటి సంస్థలను సందర్శించి అక్కడి నూతన ఆవిష్కరణల గురించి తెలుసుకున్నారు. అలాగే, తతార్‌స్థాన్ రిపబ్లిక్‌తో పారిశ్రామిక, వాణిజ్య సహకారంపై చర్చలు జరిపినట్లు 'ది న్యూ ఇండియన్ ఎక్స్ ప్రెస్' తన కథనంలో పేర్కొంది. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, “భారత్, రష్యా మధ్య దీర్ఘకాలంగా విశ్వసనీయ భాగస్వామ్యం ఉంది. [illegible] 2026 సదస్సులో మా చర్చలు పరిశ్రమలు, టెక్నాలజీ, స్మార్ట్ సిటీలు, ఏఐ, అత్యాధునిక తయారీ రంగాల్లో కొత్త సహకారానికి మార్గం వేశాయి,” అని తెలిపారు. మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, స్థిరమైన విధానాలతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ తయారీ, టెక్నాలజీ కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'స్పేస్ పాలసీ 4.0'ను, శ్రీహరికోట సమీపంలో 3000 ఎకరాల్లో నిర్మించతలపెట్టిన 'తిరుపతి స్పేస్ సిటీ' ప్రాజెక్టును కూడా లోకేష్ బృందం ప్రమోట్ చేసింది. స్పేస్ టెక్నాలజీ, సెమీకండక్టర్లు, డ్రోన్లు, క్వాంటం కంప్యూటింగ్ వంటి రంగాల్లో సుమారు 4 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. సెయింట్ పీటర్స్‌బర్గ్ సమీపంలో డ్రోన్ల కదలికల వంటి భద్రతాపరమైన ఆందోళనలు ఉన్నప్పటికీ, లోకేష్ బృందం తమ లక్ష్యాలను పూర్తి చేసేందుకు పర్యటనను విజయవంతంగా కొనసాగించింది. పర్యటన ముగిసిన వెంటనే నిర్దిష్టంగా కొత్త ఒప్పందాలు ఏవీ కుదిరినట్లు అధికారికంగా ప్రకటించనప్పటికీ, భవిష్యత్ సహకారానికి, పెట్టుబడులకు ఈ పర్యటన బలమైన పునాది వేసిందని 'ది న్యూ ఇండియన్ ఎక్స్ ప్రెస్' కథనం విశ్లేషించింది.

# మీ తాటాకు చప్పుళ్లకు భయపడేదిలేదు

మొదటిపేజీ తరువాయి – తాగునీటి ప్రాజెక్టులు, రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టులు మొదలైన పనుల్లో కేంద్రం నుంచి నిధులు రాకుండా కాళ్లలో కట్టెలు పెడుతున్నాడంటూ విమర్శలు చేశారు. అంతేకాకుండా రేవంత్ ను తాము తల్చుకుంటే తెలంగాణ పొలిమేరల్లో తిరగకుండా చేస్తామంటూ ఫైర్ అయ్యారు. కిషన్ రెడ్డి ఒక లడాయి కోతి అంటూ ఏకీపారేశారు. దమ్ముంటే, చిత్తశుద్ధి ఉంటే మహా రాష్ట్ర సీఎం దేవెంద్ర ఫడ్నవీస్ తో మాట్లాడేందుకు అపాయింట్ మెంట్ తీసుకొని రావాలని ప్రజల కోసం కిషన్ రెడ్డి ఇంటికి వెళ్లడానికైన సిద్ధమన్నారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి వరుస ఘాటు విమర్శలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మరోసారి మాస్ కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. తెలంగాణ రాజకీయాల్ని అవినీతి, అక్రమాలు, దోపిడిల పాలు చేశారంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు. హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ కుప్పకూలడానికి రేవంత్ ప్రభుత్వం విధానాలే కారణమన్నారు. కాంగ్రెస్ మంత్రులు ఎవరికి వారు ఎక్కడ దోచుకోవాలన్నదే ఆలోచనలు చేస్తున్నారన్నారు. ఇండస్ట్రీలు దెబ్బతిన్నాయన్నారు. సీఎం రేవంత్ నిర్ణయాల వల్ల తెలంగాణ అప్పుల రాజ్యంగా మారిందన్నారు. దీంతో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందన్నారు. ప్రభుత్వ భూముల్ని ఇష్టారీతిన అమ్మివేస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడంలేదని ఆందోళనలు వ్యక్తం చేశారు. అంతే కాకుండా.. తాను రేవంత్ రెడ్డిలా నేను మాటకారిని కాదు.. మాట మీద నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. పదవుల కోసం పార్టీలు మారే నైజం నాది కాదని, మీరు ఇచ్చిన హామీలపై అమరవీరుల స్థూపం దగ్గరైనా, ప్రెస్ క్లబ్ లోనైనా చర్చకు నేను రెడీ.. మీరు సిద్ధమేనా?.. దమ్ముంటే చర్చకు వస్తావా..అంటూ సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ఆయన చేస్తున్న ఆరోపణలు నిజమైతే.. తాను ఏ శాఖ అభివృద్ధిని అడ్డుకున్నానో సీనియర్ జర్నలిస్టుల ముందు రేవంత్ రెడ్డి నిరూపించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సవావ్ విసిరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందంటే అది రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీల దయాదాక్షిణ్యాల వల్లేమీ కాదని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. నేను అంబర్‌పేట్, సికింద్రాబాద్ ప్రజల ఆశీస్సులతో ఢిల్లీకి వెళ్లానని, రేవంత్ రెడ్డికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదని మండిపడ్డారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, మెట్రో ఫేజ్–2 పై సీఎం చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మెట్రో ఫేజ్–2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని చెప్పుకొచ్చారు. తుమ్మిడిహట్టి అపాయింట్‌మెంట్ విషయంలో రేవంత్ రెడ్డి ఇప్పటికైన అసత్య ప్రచారాలు మానుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చురకలు పెట్టారు.

## పశ్చిమ బెంగాల్‌లో పార్టీలో సంక్షోభం

మొదటిపేజీ తరువాయి – చీఫ్ విప్‌గా నియమితులైన కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ, గతంలో మమతా బెనర్జీ నాయకత్వాన్ని ఆకాశనికెత్తిన వారే, ఇప్పుడు పార్టీ అధికారంలో లేదనే సాకుతో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది కేవలం అధికారం కోసం చేస్తున్న ద్రోహమని ఆయన ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లో అధికారం కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నాయకత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన సుమారు 20 మంది లోక్‌సభ ఎంపీలు, పార్లమెంటులో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తమను ప్రత్యేక వర్గంగా గుర్తించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసినట్లు రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ దస్తిదార్ ప్రకటించారు. రాష్ట్రంలో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ ఓటమి అనంతరం పార్టీలో అసమ్మతి జ్వాలలు మిన్నంటాయి. ఇప్పటికే 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు పార్టీ అధికారిక శాసనసభాపక్ష నేత అభ్యర్థిని కాదని, బహిష్కరణకు గురైన నేతకు మద్దతు తెలపడం గమనార్హం. తాజాగా ఈ సంక్షోభం పార్లమెంటుకు సైతం పాకింది. పార్టీలో పెరుగుతున్న అవినీతి, సీనియర్ నేతలను విస్మరించడం, మమత కుటుంబ సభ్యుల ఆధిపత్యమే ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణాలని అసమ్మతి నేతలు ఆరోపిస్తున్నారు. పలువురు రెబల్ ఎంపీలు ఇప్పటికే కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్, బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారితో సమావేశమయ్యారు.

## అది పవిత్ర రంజాన్ మాసంలో జరిగిన నరమేధం

మొదటిపేజీ తరువాయి – పెను ముప్పు అని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఐరాస సర్వసభ్య సమావేశంలో భారత శాశ్వత ప్రతినిధి, అంబాసిడర్ హరీశ్ పర్వతనేని మాట్లాడుతూ.. పాకిస్థాన్ దాడుల్లో అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని ఐక్యరాజ్యసమితి సహాయ మిషన్ (యూఎన్ఏఎంఏ) నివేదికలను ఆయన ఉటంకించారు. ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే 372 మంది పౌరులు మరణించారని, మరో 397 మంది గాయపడ్డారని తెలిపారు. వీరిలో అత్యధికులు పవిత్ర రంజాన్ మాసంలోనే లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడుల్లో మరణించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఇదే సమావేశంలో ఐరాస నివేదికల విశ్వసనీయతను పాకిస్థాన్ ప్రశ్నించడాన్ని భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. “బహుళపక్షవాదం, ఐక్యరాజ్యసమితి పట్ల మద్దతు అనేది ఎవరి ఇష్టానుసారం వారు ఎంచుకునే మెనూ కాదు. మీకు నచ్చినప్పుడు దాన్ని స్వీకరించి, నచ్చనప్పుడు తిరస్కరించడం కుదరదు” అని పర్వతనేని పాకిస్థాన్‌కు గట్టిగా బదులిచ్చారు. ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి, స్థిరత్వం కోసం యూఎన్ఏఎంఏ చేస్తున్న కృషికి భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాలను, ముఖ్యంగా అంతర్జాతీయ మానవతా చట్టాలను గౌరవించాలని, పౌరుల రక్షణను నిర్ధారించాలని ఐరాస సెక్రటరీ జనరల్ చేసిన పిలుపును భారత్ సమర్థిస్తోందని పర్వతనేని తెలిపారు. ఈ దాడులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని యూఎన్ఏఎంఏ చేసిన డిమాండ్‌కు భారత్ మద్దతు తెలుపుతోందని ఆయన వివరించారు. ఇటువంటి దారుణమైన హింసాత్మక చర్యలు ఆమోదయోగ్యం కావని భారత్ స్పష్టం చేసింది.

## పీఓకేలో రక్తపాతం పాక్‌పై అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలి

మొదటిపేజీ తరువాయి – భారత్ మంగళవారం పేర్కొంది. జూన్ 7, 8 తేదీల్లో రావల్‌కోట్‌లో భద్రతా బలగాలకు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) మద్దతుదారులకు మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు జరిగాయి. ఈ హింసాకాండలో ఆరుగురు నిరసనకారులు, నలుగురు పోలీసులు, ఒక సామాన్య పౌరుడితో సహా 30 మంది మరణించగా, 200 మందికి పైగా గాయపడ్డారు.

**అసలేం జరిగింది?**

సరసమైన ధరలకు గోధుమ పిండి, విద్యుత్ సరఫరా చేయాలని, రాజకీయ హక్కులు కల్పించడంతో పాటు తమ ప్రాంతంపై చూపుతున్న వివక్షను అంతం చేయాలని డిమాండ్ చేస్తూ జేఏఏసీ అనే పౌర సమాజ కూటమి ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే నిరసనలు ఉద్రిక్తంగా మారి హింసకు దారితీశాయి. నిరసనకారులే ముందుగా కాల్పులు జరిపారని, అందుకే తాము ఆత్మరక్షణ కోసం స్పందించాల్సి వచ్చిందని పాకిస్థాన్ అధికారులు చెబుతున్నారు. అయితే, భద్రతా బలగాలే తమపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి ఊచకోతకు పాల్పడ్డాయని జేఏఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియాలో మృతుల సంఖ్య 150 నుంచి 200 వరకు ఉండవచ్చని వదంతులు వ్యాపిస్తున్నప్పటికీ, ప్రభుత్వం కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఆంక్షలు విధించడంతో వాస్తవాలను ధృవీకరించడం కష్టంగా మారింది. ఈ ఘటనపై బ్రిటన్‌లోని ప్రవాస కశ్మీరీలు పాకిస్థాన్ కాన్సులేట్ వద్ద నిరసనలు చేపట్టారు. ప్రస్తుతం పీఓకేలో బంద్ కొనసాగుతుండగా, ముజఫరాబాద్, భీంబర్, మీర్‌పూర్ వంటి ప్రాంతాల్లో పరిస్థితులు ఇంకా ఉద్రిక్తంగానే ఉన్నాయి.

## రూ. 13,000 కోట్లతో గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్టు..

మొదటిపేజీ తరువాయి – ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రతిపాదిత ద్వంద్వ ప్రయోజన విమానాశ్రయం గ్రేట్ నికోబార్ ఆగ్నేయ తీరంలోని గలథియా బే సమీపంలో ఉన్న చింగెన్‌లో ఏర్పాటు కానున్నట్లు ప్రభుత్వ, రక్షణ వర్గాలు తెలిపాయి. ఇది పౌర, సైనిక విమానయాన అవసరాలు రెండింటికీ ఉపయోగపడుతుంది. హిందూ మహాసముద్రం, దక్షిణ చైనా సముద్రాన్ని కలిపే ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే సముద్ర మార్గాల్లో ఒకటైన మలక్కా జలసంధి పశ్చిమ మార్గాలకు సమీపంలో ఉండటం వల్ల ఈ ప్రదేశం వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైనది. భూభాగ పరిమితులు, నావిగేషన్ సవాళ్లు, విస్తృతమైన సహాయక మౌలిక సదుపాయాల అవసరం కారణంగా ప్రస్తుత ఉన్న 4,500 అడుగుల రన్‌వేను సుమారు 10,000 అడుగులకు పొడిగించడం కష్టమని అధ్యయనాలు తేల్చాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం కంటే రన్‌వే విస్తరణ గిరిజన నివాసాలు, అడవులు, వన్యప్రాణుల ఆవాసాలపై ఎక్కువ ప్రభావం చూపుతుందని అధికారులు కూడా నిర్ధారించారు. కొత్త విమానాశ్రయం ఐదేండ్లలో పూర్తి అవుతుందని అంచనా. ఈ గ్రీన్‌ఫీల్డ్ సైట్ భవిష్యత్ విస్తరణకు ఎక్కువ స్థలాన్ని అందిస్తుందని, అలాగే వ్యూహాత్మకంగా ముఖ్యమైన అండమాన్, నికోబార్ ద్వీప సమూహంలో భారతదేశ సైనిక పరిధిని, నిఘా సామర్థ్యాలను, లాజిస్టిక్స్ ఉనికిని బలోపేతం చేస్తుందని అధికారులు వాదిస్తున్నారు. కాగా, ఈ ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇది దేశ సహజ, గిరిజన వారసత్వ సంపదను ధ్వంసం చేయడమేననిమండిపడ్డాయి.

# బీబీ.. బీ కేర్‌ఫుల్.. దాడులు కొనసాగితే ఏకాకిగా ఇజ్రాయెల్ : ట్రంప్



ఇరాన్‌పై భారీ స్థాయి సైనిక చర్యను ప్రారంభిస్తే ఇజ్రాయెల్ ఏకాకిగా మిగిలిపోవచ్చని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ట్రంప్ హెచ్చరించారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య గత 24 గంటలుగా ఉద్రిక్తతలు పెరిగిన అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆక్సియోస్ వార్తాసంస్థతో మాట్లాడుతూ బీబీ.. మీరు జాగ్రత్తగా ఉండటం మంచిది. లేకపోతే త్వరలోనే మీరు ఒంటరిగా మిగిలిపోతారు అని నెతన్యాహుకు చెప్పాను అని తెలిపారు. తిరిగి ఘర్షణలు చెలరేగితే ఇరాన్‌తో దౌత్య ఒప్పందం కుదుర్చుకునే ప్రయత్నాలకు ఆటంకం కలుగవచ్చని, అంతేగాక అమెరికాను ప్రాంతీయ ఘర్షణలలోకి మరింత లోతుగా లాగవచ్చన్న తన ఆందోళన పెరుగుతున్నదని ట్రంప్ ఆక్సియోస్‌కు తెలిపారు. ఆదివారం బీరుట్‌లోని హెజ్బొల్లా లక్ష్యాలపై ఇజ్రాయెల్ దాడులు చేయడం, ఇందుకు ప్రతీకారంగా ఇరాన్ తన క్షిపణులతో ఇజ్రాయెల్‌పై దాడి చేయడంతో మళ్లీ ప్రాంతీయ యుద్ధ భయాల నేపథ్యంలో నెతన్యాహుకు ట్రంప్ తాజా హెచ్చరికలు జారీచేశారు.

**హెర్మూజ్ వద్ద కూలిన అమెరికా అపాచీ హెలికాప్టర్**

హెర్మూజ్ వద్ద యూఎస్‌కు చెందిన అపాచీ హెలికాప్టర్ కుప్పకూలింది. ఇందులో ఉన్న ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. హెలికాప్టర్ కూలిపోయిన చోటనే యూఎస్ డ్రోన్లను కూల్చినట్టు ఇరాన్ ప్రకటించింది. హెలికాప్టర్ కూల్చిన ఘటనకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్‌ను ట్రంప్ హెచ్చరించారు.

నిజం దృష్టి తెలుగు న్యూస్

బుధవారం 10-06-2026

# రేపటి సీఎం రేవంత్ అన్న సభను జయప్రదం చేద్దాం

మహేశ్వరం నియోజకవర్గానికే మణిహారం ఫ్యూచర్ సిటీ

పాలన భవనం, స్కిల్ యూనివర్సిటీ సహా మరోసారి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు.



**నిజం న్యూస్ హైదరాబాద్, జూన్ 9:** మహేశ్వరం నియోజకవర్గానికి మణిహారంగా నిలిచే భారత్ ఫ్యూచర్ సిటీ కి ప్రజలంతా తరలిరావాలని మంత్రి శ్రీధర్ బాబు సహా కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. రేపు సాయంత్రం 4 గంటలకు ఫ్యూచర్ సిటిలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సీఎం రాక సందర్భంగా మరోసారి ఏర్పాట్లను పరిశీలించారు శ్రీధర్ బాబు, లక్ష్మారెడ్డి సహా కాంగ్రెస్ నాయకులు. ఫ్యూచర్ సిటి డెవలప్మెంట్ అథారిటీ, స్కిల్ యూనివర్సిటీల ప్రారంభోత్సవాలను కనుల పండుగగా జరుపుకునేందుకు జనం, కాంగ్రెస్ శ్రేణులు స్వచ్ఛందంగా తరలిరావాలని కిచ్చెన్నగారు కోరారు. ఉద్యోగ, ఉపాధి ఇచ్చే స్కిల్ యూనివర్సిటీ - పాలన సౌలభ్యం కోసం నిర్మించిన ఫ్యూచర్ సిటి డెవలప్మెంట్ అథారిటీ భవనాలు అందుబాటులోకి రావటం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా భావిస్తున్నట్లు ఖూ= చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి గారి సభకు తరలిరావాలని మరోసారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

జాతీయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ కె. జి. బాలకృష్ణన్ కు వినతి పత్రం సమర్పించిన

తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు- బిషప్ దుర్గం ప్రభాకర్



**నిజం న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి, జూన్ 9 మంగళవారం :** న్యూఢిల్లీ డా. బి. ఆర్. అంబేద్కర్ భవన్ లో దళిత క్రైస్తవులకు షెడ్యూల్డ్ కులాల (రాజ) హోదా కల్పించాలని కోరుతూ భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ కె. జి.బాలకృష్ణన్ కు తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , బి. ఆర్. యస్ క్రైస్తవ రాష్ట్ర నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ న్యూ డిల్లీ లో డా. బి. ఆర్.అంబేద్కర్ భవన్ లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులు మతం మారినప్పటికీ వారి సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటుతనం తొలగిపోలేదని, రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం వారికి కూడా అందేలా ఎస్సీ హోదా కల్పించాలని కోరారు. దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న వివక్ష, అవకాశాల కొరత, విద్యా మరియు ఉద్యోగ రంగాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాను అనీ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడం ద్వారా వారికి విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలలో సమాన అవకాశాలు లభిస్తాయని, ఇది సామాజిక న్యాయం సాధనలో కీలక అడుగుగా నిలుస్తుందని ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకునే విదంగా చొర్వ చూపాలని వారనీ కోరాము అన్నారు

# తన వీరాభిమాని కోరిక తీర్చిన సీఎం చంద్రబాబు నాయుడు



**నిజం న్యూస్ ఆంధ్రప్రదేశ్, జూన్ 9:** ఎప్పటి నుంచో తనను చూడాలనుకుంటున్న ఓ అభిమాని కోరికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం తీర్చారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం కామధేనువులంక గ్రామానికి చెందిన సత్యనారాయణ సీఎం చంద్రబాబుకు వీరాభిమాని. తమ నియోజకవర్గానికి చంద్రబాబు వస్తున్నారని, దూరం నుంచైనా ఆయన్ను చూడాలని మాట్లాడిన వీడియో వైరల్ అయ్యి సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. సత్యనారాయణ సిద్ధాంతంలో కలుద్దాం అని సీఎం రిప్లై కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ (మీ భూమి -- మీ హక్కు) కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధాంతం వెళ్లిన సీఎం చంద్రబాబు కార్యక్రమం అనంతరం తన బస్సులోకి సత్యనారాయణను ప్రత్యేకంగా పిలిపించుకున్నారు. కాసేపు ఆత్మీయంగా మాట్లాడి కుటుంబ వివరాలు, ఆరోగ్యం గురించి ఆరా తీశారు. తన కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని, అతనికి వైద్యసాయం అందించాలని సత్యనారాయణ కోరారు. తమ గ్రామానికి డ్రైనేజ్ సదుపాయం కల్పించాలని విన్నవించారు. ఆ సమస్యలపై భరోసా ఇచ్చి సత్యనారాయణకు ఇల్లు కూడా నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు.

# మియాపూర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ విజయవంతమైన సందర్భంగా ఎమ్మెల్యే గాంధీని సన్మానించిన పార్టీ నాయకులు



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూన్ 9:** మియాపూర్ లో జరిగిన ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ ను పెద్ద ఎత్తున విజయవంతం చేసిన సందర్భంగా శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ని తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస్, ఉప్పలపాటి శ్రీకాంత్ ఎమ్మెల్యే ని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా ౹రాజ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సుమారుగా రూ. 2000 కోట్ల రూపాయల తో మియాపూర్ చౌరస్తా ఫ్లై ఓవర్ , సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్(జవీజ) ప్రధాన కార్యాలయం , ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి కి స్వాగతం సుస్వాగతం. నా తరుపున, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలియచేస్తున్నాను. అదేవిధంగా సభను విజయవంతం చేయడానికి రాత్రి పగలు అనే తేడా లేకుండా అహర్నిశలు కృషి చేసిన నియోజకవర్గ ప్రజలకు, తాజా మాజీ కార్పొరేటర్లకు, నాయకులకు, కార్యకర్తలకు, మహిళ సోదరీమణులకు, పాత్రికేయ మిత్రులకు, అధికారులకు , అనాధికారులకు, అభిమానులకు, శ్రేయభిలాషులకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేసిన గౌరవ ౹రాజ చైర్మన్ ఆరెకపూడి గాంధీ . ఈ కార్యక్రమంలో చంద్రకాంత్, గోపాల్, త్రిమూర్తి రాజు, లింగం, సుధాకర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్--మీడియా సత్సంబంధాలకు వేదికగా 'సైబరాబాద్ ప్రెస్ పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్--2026' ప్రారంభం

టోర్నమెంట్‌ను ప్రారంభించిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, ఐపీఎస్.,



**నిజం న్యూస్ సైబరాబాద్, జూన్ 9:** పోలీస్--మీడియా మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న "సైబరాబాద్ ప్రెస్ ఢ పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్--2026" టోర్నమెంట్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., మంగళవారం సైబరాబాద్ సీపీ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభించారు. సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, అదనపు డీసీపీ షమీర్ ఆధ్వర్యంలో జూన్ 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది , మీడియా ప్రతినిధులతో కూడిన జట్లు ఇందులో పాల్గొంటున్నాయి. టోర్నమెంట్ తొలి రోజు జరిగిన మ్యాచ్‌లలో మల్కాజిగిరి మీడియా థండర్స్ జట్టు కెప్టెన్ వంశీ నాయకత్వంలో క్రైమ్ పార్ట్నర్స్ జట్టుతో తలపడింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో మల్కాజిగిరి మీడియా థండర్స్ జట్టు విజయం సాధించగా, అద్భుత ప్రదర్శన కనబర్చిన జెస్తాది రాజు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. మరో మ్యాచ్‌లో ఎస్‌సీఎస్‌సీ డిఫెండర్స్ జట్టు కెప్టెన్ ప్రణవ్ నాయకత్వంలో, శేరిలింగంపల్లి జట్టు కెప్టెన్ ఖాదిర్ నాయకత్వంలోని జట్టుతో పోటీ పడింది. ఈ మ్యాచ్‌లో ఎస్‌సీఎస్‌సీ డిఫెండర్స్ జట్టు విజయం సాధించగా, అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించిన శివ కుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ పోలీసు శాఖ , మీడియా ప్రతినిధుల మధ్య పరస్పర అవగాహన, సమన్వయం, స్నేహపూర్వక వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడంలో ఇటువంటి క్రీడా పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రీడాస్ఫూర్తితో పాటు ఐక్యత, జట్టుగా పనిచేసే భావన, పరస్పర గౌరవాన్ని పెంపొందించడమే ఈ టోర్నమెంట్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.



"యునైటెడ్ ఇన్ స్పిరిట్ -- స్ట్రాంగర్ టుగెదర్" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ జూన్ 11న సాయంత్రం జరగనుంది.

# పార్టీ మరీనా ఎమ్మెల్యే గాంధీకి దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ గెలవాలి

సీఎం సభ ఫ్లాప్ అయితే.. మా గడియారాల పంపిణీపై నెపం నెడతారా?

అధికారం ఏ పార్టీలో ఉంటే.. ఆ పార్టీకి వంగి సలాం కొట్టడం నీకు అలవాటే

గతంలో వేసిన శిలాఫలకాలు నిన్ను చూసి వెక్కిరిస్తున్నాయి..మళ్ళీ కొత్త శిలపలకలు ఎందుకు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ బొబ్బ నవతా రెడ్డి



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూన్ 9:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన సభ పూర్తిగా విఫలం కావడంతో, ఆ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తమపై అభాండాలు వేస్తున్నారని బొబ్బ నవతా రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దమ్ము, ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలిచి తన సత్తా నిరూపించుకోవాలని ఆమె సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి సభ వైఫల్యంపై, ఎమ్మెల్యే గాంధీ చేసిన వ్యాఖ్యలపై బొబ్బ నవతా రెడ్డి ఒక ప్రకటనలో ఘాటుగా స్పందించారు.

**సీఎం సభ ఫ్లాప్ అయితే.. మాపై ఏడుపా?**

ముఖ్యమంత్రి సభకు ప్రజలు రాకపోవడం, వచ్చిన వారికి కనీస సదుపాయాలు కల్పించలేకపోయిన ఎమ్మెల్యే గాంధీ.. సీఎం ముందే ప్రతిపక్షాలపై నెపం నెట్టడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని నవతా రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షం వారు ఇంటింటికీ వెళ్లి శాలువాలు కప్పి, గడియారాలు పంపిణీ చేసి మీటింగ్ కు వెళ్లొద్దని చెప్పడం వల్లే జనం రాలేదని స్వయంగా సీఎం ముందే ఎమ్మెల్యే క్షమాపణలు కోరడం సిగ్గుచేటన్నారు. గత రెండు నెలలుగా బీఆర్ఎస్ అధినాయకులు కేసీఆర్ కేటీఆర్ అన్న, హరీశ్ అన్న, కృష్ణ అన్నల ఫోటోలతో కూడిన గడియారాలను పంచుతూ.. గడప గడపకూ తిరుగుతూ ప్రజల కష్టసుఖాల్లో తాము ఉంటున్నామని, అది చూసి భరించలేక, కడుపుమంటతోనే ఎమ్మెల్యే గాంధీ ముఖ్యమంత్రి ముందు ఇంత చిల్లరగా మాట్లాడుతున్నారని ఆమె దుయ్యబట్టారు.

**అధికారం ఎవరిదైతే వారికి సలాం కొట్టే తీరు నిది**

అసలు ఎమ్మెల్యే గాంధీ ఏ పార్టీలో ఉన్నారో, ఆయన అధినాయకుడు ఎవరో ప్రజలకు చెప్పే ధైర్యం ఉందా? అని నవతా రెడ్డి నిలదీశారు. సైకిల్ (టీడీపీ) గుర్తుపై గెలిచి కారెక్కిన గాంధీ.. మళ్లీ కారు (బీఆర్ఎస్) గుర్తుపై గెలిచి ఇప్పుడు కాంగ్రెస్ నాయకుల చేతిలో చెయ్యి వేశారని ఎద్దేవా చేశారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వంగి సలాం కొట్టడం, ఆ ముఖ్యమంత్రిని పొగడటం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. 2018, 2023 ఎన్నికల్లో రూ. 5 వేల కోట్లు, రూ. 9 వేల కోట్లతో నియోజకవర్గాన్ని అమెరికా తరహాలో అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పిన ఆయన.. ఇప్పుడు రేవంత్ రెడ్డికి దొంగ నమస్కారాలు పెడుతున్నారని విమర్శించారు.

**బీఆర్ఎస్ పార్టీ పేరు ఎత్తే హక్కు, అర్హత గాంధీకి లేవన్నారు.**

**అంకెల గారడీ.. క్రెడిట్ కొట్టేసే కుట్ర!**

కేసీఆర్, కేటీఆర్ హయాంలో నగరంలో 30 నుంచి 40 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండు ఫ్లైఓవర్లు ప్రారంభించి 200 మాటలు చెబుతూ పెద్ద హంగామా చేస్తోందని విమర్శించారు. చేసేది రూ. 800 కోట్ల పనులైతే, వాటిని రూ. 2 వేల కోట్లుగా తప్పుడు లెక్కలు చూపుతున్నారని మండిపడ్డారు. శంకుస్థాపన చేసిన రూ. 1600 కోట్ల పనుల్లో శేరిలింగంపల్లికి చెందినవి కేవలం రూ. 600 కోట్లేనని, మిగతా శంకర్‌పల్లి, ఓఆర్ఆర్, కొల్లూరు, బాచుపల్లి తదితర ప్రాంతాల పనులను కూడా ఇక్కడివే అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. చందానగర్‌లో జర్నలిస్టులు, మార్వాడీలు, మైనార్టీలు, వివిధ కుల సంఘాలకు భవనాల కోసం స్థలాలు కేటాయించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కానీ ఆ క్రెడిట్ రేవంత్ రెడ్డికి ఇస్తూ గాంధీ అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే ఆ స్థలాల్లో భవనాలు నిర్మించి అప్పుడు గొప్పలు చెప్పుకోవాలన్నారు.

**పాత హామీలేమయ్యాయి.. శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయి!**

గత పదేళ్లుగా వాగ్దానాలు చేసి వదిలేసిన 700 పడకల ఆసుపత్రి, 50 ఎకరాల్లో బస్ టెర్మినల్, మియాపూర్-బీహెచ్ఈఎల్ సింగిల్ పిల్లర్ మెట్రో, చెరువుల సుందరీకరణ, 16 ఎస్టీపీ ప్లాంట్లు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ఏమయ్యాయని నవతా రెడ్డి ప్రశ్నించారు. ఈ హామీలన్నీ గాలికొదిలేసి.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల కోసమే మళ్లీ కొత్త శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. గతంలో ఎన్నికల సమయంలో ఆయన వేసిన శిలాఫలకాలే ఇప్పుడు ఆయన్ను చూసి వెక్కిరిస్తున్నాయని ఆమె ఘాటుగా విమర్శించారు.

# బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణం ముమ్మాటికి బిఆర్ఎస్ ఘనతనే : బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

బిఆర్ఎస్ ప్రభుత్వహయాంలో శంకుస్థాపన చేసిన పనులను పూర్తిచేయడం తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన పని ఒకటి లేదు....

**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూన్ 9:** మంగళవారం సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లి చౌరస్తాలో నూతనంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఫ్లై ఓవర్ ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని, నిర్లక్ష్య ధోరణిని ఎండగట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. బాచుపల్లి ఫ్లేవర్ నిర్మాణంతోపాటు హైదరాబాద్ మహానగర అభివృద్ధి ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుంది. అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, అలసత్వాన్ని అసెంబ్లీ వేదికగా పలుమార్లు ప్రశ్నించినందుకే ఈ బాచుపల్లి ఫ్లైఓవర్ పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన కొట్లాడి అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు కృషి చేసే ఏకైక పార్టీ బిఆర్ఎస్. ముఖ్యమంత్రి ఆగ మేఘాల మీద శంకుస్థాపనలు చేసి ఎక్కడో మియాపూర్ లో ఉంటూ బాచుపల్లి ఫ్లైఓవర్ ను ప్రారంభించడం కుత్బుల్లాపూర్ ప్రజలను అవమానించడమే. ఎస్ ఎన్ డి పి, ఎస్ ఆర్ డి పి పేరుతో టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు హెచ్ - సిటి అంటూ పేరు మార్చడం తప్పా చేసింది ఏం లేదు. ఈ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయిన ఇప్పటివరకు సుచిత్ర - కొంపల్లి ఫ్లైఓవర్ పనులను పూర్తి చేయలేకపోయింది. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం నేపాన్ని నెట్టివేసి చేతులు దోచుకుంటున్నారే తప్పా చేసిందేమీ లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం తన ఊహల నగరమైన ఫోర్త్ సిటీని ప్రచారం చేస్తూ ఉన్న నగరాన్ని విస్మరిస్తున్నారు ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్రం తో పాటు హైదరాబాద్ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీయే రక్ష.



# ఏసీబీ రైడ్.. ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలు





**నిజం న్యూస్ హైదరాబాద్, జూన్ 9:** రోడ్లు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) మోహన్ నాయక్‌కు చెందిన నివాసాలు, ఆస్తులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఇవాళ విస్తృత సోదాలు నిర్వహించారు. మాదాపూర్‌లోని మోహన్ నాయక్ నివాసంతో పాటు ఆయన బంధువులు, సన్నిహితులకు సంబంధించిన మొత్తం 11 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

# అమీర్పేట్ డివిజన్లో మంచినీటి సమస్యపై జిఎం ను కలిసిన స్థానిక నాయకులు



**నిజం న్యూస్ అమీర్పేట్, జూన్ 9:** గత కొన్ని రోజులుగా అమీర్పేట్ డివిజన్ లోని కొన్ని ప్రాంతాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో పది రోజుల క్రితం ఆయా ప్రాంత ప్రజలతో వాటర్ వర్క్స్ ముందు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టిన కూడా మళ్లీ మళ్లీ అదే సమస్య పునరావృతం కావడంతో ప్రజలు మంచినీళ్ల కొరకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో మళ్లీ మంగళవారం బల్కంపేట్ బి జె ఆర్ నగర్ కుమరబస్తి సర్దార్జీలు ఏరియా అందరూ కలిసి వాటర్ వర్క్స్ డైరెక్టర్ , సిజిఎం ప్రభు ని కలిసి సమస్యను వివరించి తక్షణమే పరిష్కార మార్గం చూపవలసిందిగా అమీర్పేట్ ప్రజల అందరి తరపున వినతి పత్రం ఇచ్చి నీటి సమస్యను సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిందిగా కోరడం జరిగింది సానుకూలంగా స్పందించిన సీజీఎం ప్రభు తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు , పలు బస్తీల వాసులు పాల్గొనడం జరిగింది

నిజం
దృష్టి తెలుగు న్యూస్
TG/TEL/25/A3731
బుధవారం 10-06-2026

## వేసవిలో చేతులపై టాన్ పేరుకుందా.. రంగుని మెరుగుపరిచేందుకు ఈ సింపుల్ టిప్స్ ట్రై చేయండి..



వేసవిలో ముఖాన్ని జాగ్రత్తగా చూసుకోవడం ఎంత ముఖ్యమో, చేతులను జాగ్రత్తగా చూసుకోవడం కూడా అంతే ముఖ్యం. అటువంటి పరిస్థితిలో చేతులపై టాన్ ను తొలగించడానికి ఇంట్లో ఉన్న కొన్ని వస్తువులను ఉపయోగించవచ్చు. ఇది చేతుల రంగును పెంచడమే కాదు వాటికి సహజమైన మెరుపును కూడా ఇస్తుంది. కనుక ఇంట్లోనే ఏ వస్తువులతో టాన్ రిమూవల్ మాస్క్ తయారు చేసుకోవచ్చో ఈ రోజు తెలుసుకుందాం.. వేసవి కాలం చాలా సమస్యలను తెస్తుంది. ముఖ్యంగా చర్మ సంరక్షణ విషయానికి వస్తే తీవ్రమైన సూర్యకాంతి, వేడి గాలుల కారణంగా చర్మం టాన్ అవ్వడం సర్వసాధారణం. దీంతో ముఖ సంరక్షణపై ఎక్కువ శ్రద్ధ చూపించే మనం.. చేతుల విషయంలో కేరింగ్ ను విస్మరిస్తాము. అయితే చేతులకు కూడా జాగ్రత్త అవసరం. ప్రత్యక్షంగా సూర్య కిరణాలు తాకడం వలన చేతుల రంగును మారుస్తాయి. అవి పొడిగా, ముదురు రంగులో కనిపిస్తాయి. టానింగ్ తొలగించడానికి మార్కెట్లో అనేక ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. అయితే కొన్నిసార్లు అవి ఖరీదైనవి, కొన్నిసార్లు రసాయనాల కారణంగా ప్రజలు వాటిని ఉపయోగించడానికి ఇష్టపడరు. అటువంటి పరిస్థితిలో సురక్షితమైన, సులభమైన పరిష్కారం వంటింటి చిట్కాలు. ఇంట్లో దొరికే పదార్థాలతో తయారుచేసిన మాస్క్‌లు టానింగ్‌ను తగ్గించడమే కాదు చర్మానికి పోషణనిచ్చి, స్కిన్ కు సహజ మెరుపును తిరిగి ఇస్తాయి. కనుక వేసవిలో టానింగ్ వల్ల ప్రభావితమైన చేతుల రంగును మెరుగుపరచడంలో సహాయపడే కొన్ని సులభమైన, ప్రభావవంతమైన ఇంట్లో తయారుచేసే మాస్క్‌ల గురించి ఈ రోజు తెలుసుకుందాం.. శనగపిండి, పసుపు, పెరుగు మాస్క్ వేసవిలో చేతులపై వచ్చే టానింగ్‌ను తొలగించడానికి శనగపిండి మాస్క్ ఒక అద్భుతమైన నివారణ. దీని కోసం 2 చెంచాల శనగపిండి, 1 చిటికెడు పసుపు , 1 చెంచా పెరుగు కలిపి పేస్ట్ తయారు చేసుకోవాలి. దీని తర్వాత దానికి కొన్ని చుక్కల నిమ్మరసం కలపండి. ఈ మిశ్రమాన్ని చేతులకు రాసుకుని 20 నిమిషాల తర్వాత చేతులు కడుక్కోవాలి. ఈ మాస్క్ ట్యానింగ్‌ను తొలగించడమే కాదు చర్మాన్ని తేమగా కూడా ఉంచుతుంది.

## ఐఐటీ జంక్షన్ -- డీఎల్ఎఫ్ కారిడార్ రహదారి అభివృద్ధి పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ



సైబరాబాద్, **జూన్ 09 నిజం న్యూస్:** గచ్చిబౌలి పరిధిలోని ఐఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ఈ రోజు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ నుండి డీఎల్ఎఫ్ జంక్షన్ వరకు చేపడుతున్న ఫ్లైఓవర్ మరియు రహదారి విస్తరణ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. శేర్లింగంపల్లి ఏడీసీపీ హనుమంతరావు, సిఎంసి (జీవీజ) అధికారులతో కలిసి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన సీపీ, పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ అధికారులు తో మాట్లాడుతూ, నిర్మాణ పనుల దృష్ట్యా రాబోయే మూడు నెలల పాటు ప్రత్యేక ట్రాఫిక్ అడ్వైజరీ అమలు చేసి, అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని కోరారు.రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం గచ్చిబౌలి--డీఎల్ఎఫ్ మార్గంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ సురేష్, సిఎంసి అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బడిబాటలో 20శాతం అదనపు నమోదు సాధించాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**నిజం న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి, జూన్ 9:** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యా ప్రమాణాల మెరుగుదల, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఈ ఏడాది విద్యార్థుల నమోదును కనీసం 20 శాతం పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. గతంలో జీరో ఎన్రోల్మెంట్ విద్యార్థులు లేని కారణంగా మూతపడిన పాఠశాలలను గుర్తించి, ఈ విద్యా సంవత్సరం నుండి వాటిని పునఃప్రారంభించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాకు కొత్తగా మంజూరైన 91 పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో ఇన్స్ట్రక్టర్లను, ఆయాలను త్వరితగతిన నియమించాలన్నారు. విస్తృత ప్రచారం నిర్వహించి ఈ కేంద్రాలలో చిన్నారులను పెద్ద సంఖ్యలో చేర్పించడంతో పాటు, అవసరమైన మౌలిక వసతులను సమకూర్చాలని స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా గ్యాస్ కనెక్షన్లు, మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలన్నారు. ముఖ్యంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ర్యాంపులు, వెస్టర్న్ టాయిలెట్లను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు ఇప్పటికే మంజూరైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్లు, కంప్యూటర్లు నిరంతరం పనిచేసే స్థితిలో ఉండేలా చూసుకోవాలని, ఇంటర్నెట్ సౌకర్యం లేని పాఠశాలల వివరాలతో తక్షణమే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మెరుగుపరిచి, డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రాధాన్యత అని అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి బడిబాటను విజయవంతం చేయాలని కోరారు.ఈ వెబెక్స్ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు హరికృష్ణ, సూర్యనారాయణ, రేణుక దేవి, పూలన్, వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మరియు విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు

## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్ విడుదల చేసిన బేరి రామచంద్ర యాదవ్




**నిజం న్యూస్ పరిగి , జూన్ 9:** భవన కార్మికుల సేవా సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి అనంతయ్య నివాసం దగ్గర మంగళవారం ఉదయం 11 గంటలకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్ను ఆవిష్కరించడం జరిగింది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్ పాల్గొని సందర్భంగా మాట్లాడుతూ బహుజనుల ఆరాధ్య దైవము భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బేరి రామచంద్ర యాదవ్ తో పాటు నిర్వాహక కమిటీ సభ్యులు ఉప్పరి కృష్ణయ్య, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.అనంతయ్య , గంట సుదర్శన్ తెలంగాణ రాష్ట్ర బి.ఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్ జయంతుల ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్, ఓయూ విద్యార్థి లీడర్ ఎం కుమార్ అరుణ్ కుమార్ నాగరాజు, లక్ష్మీదేవిపల్లి గోవు సత్యనారాయణ యాదవ్, శ్రీనివాస్ మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొని పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ నెల 13 - 06-2026 నాడు మాటు గూడెం గ్రామానికి పూడూరు మండల్ వికారాబాద్ జిల్లా సాయంత్రం నాలుగు గంటలకు అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందనీ, విగ్రహావిష్కరణకు అందరూ ఆహ్వానితులేనని కార్యక్రమంలో పాల్గొనాలని బేరి రామచంద్ర యాదవ్ తో పాటు నిర్వాహక కమిటీ సభ్యులు కోరారు.

## కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి ఉత్తమ వ్యాయమాల గురించి మీకు తెలుసా..?



వేయించిన ఆహారాలు, ఒత్తిడి క్రమంగా కాలేయాన్ని బలహీనపరుస్తాయని చెబుతున్నారు నిపుణులు. మందుల సహాయం తీసుకునే ముందు కాలేయాన్ని లోపలి నుండి బలోపేతం చేసే కొన్ని వ్యాయామాల గురించి తెలుసుకుందాం. మీ కాలేయం సంవత్సరాల తరబడి ఫిట్‌గా, చురుగ్గా ఉండాలని మీరు కోరుకుంటే, ఉత్తమ.. శరీరంలోని ప్రతి భాగం చాలా ముఖ్యమైనది. కానీ ఈ యంత్రం ఇంజిన్ బలహీనంగా మారితే ఏం జరుగుతుంది? మన శరీరంలో కాలేయం ఎంతో ముఖ్యమైది. ఇది శరీరంలోని అతి ముఖ్యమైన, కష్టపడి పనిచేసే అవయవాలలో ఒకటి. కాలేయం ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడటమే కాకుండా శరీరం నుండి విషపూరిత అంశాలను తొలగించడానికి కూడా పనిచేస్తుంది.

**కపాలభాతి ప్రాణాయామం**

ఇది కాలేయానికి అత్యంత ప్రభావవంతమైన యోగా ఆసనం అని భావిస్తారు. ఈ ప్రాణాయామంలో వేగంగా గాలి వదులుతూ కడుపు లోపలికి, బయటకు కదిలిస్తూ ఉంటుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది. రోజూ 5-10 నిమిషాలు కపలాభతి చేయడం వల్ల కాలేయ పనితీరు మెరుగుపడుతుంది. కపలాభతి అనేది ఒక శక్తివంతమైన ప్రాణాయామం, దీనిలో శ్వాసను వదులుతున్నప్పుడు ఉదర కండరాలు వేగంగా సంకోచిస్తూ సడలిస్తుంటాయి. ఇది కేవలం శ్వాస ప్రక్రియ మాత్రమే కాదు, ఒక రకమైన డీటాక్స్ కూడా.

**కాలేయానికి ఎలా ఉపయోగపడుతుంది?**

కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది: కపలాభతి కడుపులోని అంతర్గత అవయవాలను సక్రియం చేస్తుంది. ఇది కాలేయంపై పేరుకుపోయిన కొవ్వును తగ్గిస్తుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది: ఈ ప్రాణాయామం కాలేయం వైపు రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. కణాలు ఎక్కువ ఆక్సిజన్‌ను అందించడానికి, మెరుగ్గా పనిచేయడానికి వీలు కల్పిస్తుంది. డీటాక్స్‌లో సహాయపడుతుంది: కపలాభతి శరీరం నుండి విషపూరిత అంశాలను తొలగిస్తుంది. కాలేయం పనిని సులభతరం చేస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది: మానసిక ఒత్తిడి కాలేయ ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. కపలాభతి మనస్సును ప్రశాంతపరుస్తుంది. మరియు హార్మోన్లను సమతుల్యంగా ఉంచుతుంది. మీ కాలేయం ఆరోగ్యంగా ఉండాలని, జీవితాంతం వ్యాధులకు దూరంగా ఉండాలని మీరు కోరుకుంటే, ప్రతి ఉదయం కేవలం 10 నిమిషాలు కపలాభతి ప్రాణాయామం చేయడం అలవాటు చేసుకోండి. యోగ ఒక బహుమతి లాంటిది. ఇది ఎటువంటి ఖర్చు లేకుండా మిమ్మల్ని అంతర్గతంగా ఆరోగ్యంగా చేస్తుంది.

## రాత్రి పూట వెల్లుల్లి తింటే ఆరోగ్యానికి ఎన్ని లాభాలో తెలుసా..?



వెల్లుల్లి ఒక అద్భుతమైన ఔషధ గుణాలు కలిగిన పదార్థం. రాత్రి పడుకునే ముందు పచ్చి వెల్లుల్లిని తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఇది ఒత్తిడిని తగ్గించడంతో పాటు నిద్రను మెరుగుపరుస్తుంది. గుండె ఆరోగ్యం, షుగర్, కొలెస్ట్రాల్, బరువు నియంత్రణలోనూ సహాయపడుతుంది. వెల్లుల్లిని రాత్రి పడుకునే ముందు తింటే మన శరీరానికి ఎన్నో లాభాలు కలుగుతాయి. వెల్లుల్లిలో ఉండే సహజ గుణాలు శరీరాన్ని శుభ్రం చేసి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. పచ్చి వెల్లుల్లి మన శరీరాన్ని, మనసును రిలాక్స్ చేస్తుంది. ఒత్తిడిని తగ్గించి నిద్ర సమస్యలను దూరం చేస్తుంది. మెదడు నాడీ వ్యవస్థపై మంచి ప్రభావం చూపి గాఢమైన నిద్ర పట్టేలా చేస్తుంది. నిద్రలేమితో బాధపడే వారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. వెల్లుల్లి శరీరంలోని గ్లూకోజ్ స్థాయిలను బ్యాలెన్స్ చేస్తుంది. ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది. షుగర్ ఉన్నవారికి ఇది సహజ ఔషధంలా పని చేస్తుంది. రోజూ తగిన మోతాదులో తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. పచ్చి వెల్లుల్లి తినడం వల్ల అధిక కొలెస్ట్రాల్ సమస్య తగ్గుతుంది. ఇది చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి శరీరానికి అవసరమైన మంచి కొలెస్ట్రాల్ ను పెంచుతుంది. దీనివల్ల గుండె జబ్బుల నుంచి రక్షణ లభిస్తుంది. వెల్లుల్లిలో యాంటీబాక్టీరియల్, యాంటీవైరల్, యాంటీఫంగల్ గుణాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని రోగాల నుంచి కాపాడతాయి. తరచుగా జలుబు, దగ్గు, జ్వరం వచ్చే వారికి ఇది ఒక రక్షణ కవచంలా పని చేస్తుంది. పచ్చి వెల్లుల్లి శరీరంలోని కొవ్వును వేగంగా కరిగించడానికి సహాయపడుతుంది. ఇది మెటబాలిజంను పెంచి బరువు తగ్గాలనుకునే వారికి ఉపయోగపడుతుంది. ఆకలిని నియంత్రించడం వల్ల ఎక్కువగా తినే అలవాటు తగ్గుతుంది. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బలు తినడం వల్ల మన ఆరోగ్యానికి ఎన్నో లాభాలు కలుగుతాయి. ఇది పూర్తిగా సహజమైన పద్ధతి. అయితే ఏవైనా అనూహ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణుల సలహా తీసుకోవాలి.

## జామకాయ అనుకునేరు.. కానేకాదు! ఇదోక ప్రకృతి వరం.. క్యాన్సర్, ఊబకాయంకి దివ్యౌషధం..



ఆరోగ్యానికి మేలు చేసే కూరగాయలలో చయోటే అదేనండీ సీమ వంకాయ ఒకటి. దీనిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. బాటిల్ గోర్డ్ లేదా సోరకాయ జాతికి చెందిన ఈ కూరగాయ.. పోషకాలకు మూలం. ఇది ఊబకాయం, ప్రాణాంతక క్యాన్సర్‌లను నివారించడంలో బలేగా సహాయపడుతుంది.. ప్రతిరోజూ మనం వంట కోసం వివిధ రకాల కూరగాయలను ఉపయోగిస్తుంటాం.. అవి నాలుకకు రుచికరంగా ఉండటమే కాకుండా, ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంటాయి. అలాంటి కూరగాయలలో చయోటే అదేనండీ సీమ వంకాయ ఒకటి. దీనిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. బాటిల్ గోర్డ్ లేదా సోరకాయ జాతికి చెందిన ఈ కూరగాయ.. పోషకాలకు మూలం. ఇది ఊబకాయం, ప్రాణాంతక క్యాన్సర్‌లను నివారించడంలో బలేగా సహాయపడుతుంది. మరి వీటిని తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం..

**గుండె ఆరోగ్యానికి సప్లిమెంట్**

సీమ వంకాయలలో ఫైటోకెమికల్స్ అధికంగా ఉంటాయి. ఇవి రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడంలో, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. అలాగే ఇందులో ఉండే మైరిసెటిన్ కొలెస్ట్రాల్, వాపు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది.

**చర్మ క్యాన్సర్ నివారణకు దివ్యౌషధం**

సీమ వంకాయ లోప, బయటి తొక్కలో క్యాన్సర్‌ను నివారించగల యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది చర్మ క్యాన్సర్‌ను నివారించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది.

**హిందీ సప్లిమెంటరీ పరీక్షకు ఒకేఒక్కడు.. ఇన్విజిలేటర్లేమో ముగ్గురు!**


శరీరంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం

శరీరంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సీమ వంకాయ ఒక గొప్ప ఆహారం. ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది టైప్ 2 డయాబెటిస్ రోగులు తినడానికి ఉత్తమమైన కూడా.

**లివర్ ఆరోగ్యాన్ని కాపాడుతుంది**

సీమ వంకాయకు కాలేయంలో అనవసరమైన కొవ్వు పేరుకుపోకుండా నిరోధించే సామర్థ్యం ఉంది. గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఇది మంచి ఆహారం. ఎందుకంటే దీనిలోని %దీ%9 ప్రోటీన్ పిండం అభివృద్ధికి, ముఖ్యంగా మెదడు, వెన్నుపాము అభివృద్ధికి సహాయపడుతుంది. ఇది అకాల జనన అవకాశాలను తగ్గిస్తుంది. అధ్యయనాల ప్రకారం సీమ వంకాయలో లుకేమియా, గర్భాశయ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్ కణాల పెరుగుదలను నెమ్మదింపజేసే ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. వంకాయలోని యాంటీఆక్సిడెంట్లు మరియు పోషకాలు కణాల నష్టాన్ని నివారించడంలో సహాయపడతాయి. ఇది శరీరం యొక్క వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తుందని అనేక అధ్యయనాలు చూపించాయి. అలాగే, ఈ వంకాయ వాపుకు దివ్యౌషధం. విటమిన్ సి సమృద్ధిగా ఉండే ఈ కూరగాయ వర్షాకాలం, శీతాకాలంలో సాధారణంగా కనిపించే వివిధ బాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి భలేగా సహాయపడుతుంది.

## ఇలాంటి గుణాలున్నావారు నిత్య అసంతృప్తి వాదులు.. వీరు సుఖంగా ఉండరు.. ఎదుటివారు ఉంటే ఓర్వలేరు..



మహాభారతంలోని ముఖ్యమైన పాత్రలలో ఒకరు విదురుడు. అంబిక దాసికి, వ్యాసుడికి జన్మించినవాడు విదురుడు. అతని తెలివితేటల కారణంగా ప్రజలు ఇప్పటికీ విదురుడిని గుర్తుంచుకుంటారు. విదురుడు తన జ్ఞానం, అనుభవం ద్వారా ధృతరాష్ట్రునికి చెప్పిన నీతులను విదుర నీతిగా ప్రసిద్ధిగంచాయి. వీటిని పాటించడం వల్ల జీవితం అత్యున్నత స్థాయిలో ఉంటుందని పండితులు చెబుతారు. అదే విధంగా మనిషి జీవితంలో ముందుకు సాగాలంటే సరైన మార్గదర్శకత్వం అవసరం.. అని విదుర్ నీతిలో అనేక విషయాలు చెప్పబడ్డాయి. మనిషి జీవితంలో ముందుకు సాగాలంటే ప్రతికూల ఆలోచనలు వదిలి సానుకూల ఆలోచనలు చేయాలి. మంది గొప్ప వ్యక్తుల జీవితాలు, ఆలోచనల నుంచి ప్రేరణ పొందవచ్చు. అలాంటి ఆలోచనలు జీవితంలో ముందుకు సాగడానికి ప్రతి ఒక్కరికీ సహాయపడతాయి. మహాభారతంలోని ముఖ్యమైన పాత్రలలో మహాత్మా విదురుడు ఒకరు. అతని తెలివితేటలు, జ్ఞానం, కృష్ణ భక్తి వలన విదురుడిని నేటికీప్రజలు గుర్తుంచుకుంటారు. మహాత్మా విదురుడు చెప్పిన విధానాలను విదుర నీతి అంటారు. మహాత్మా విదురుడు ఎప్పుడూ అసంతృప్తిగా ఉండే వ్యక్తుల గురించి తన నీతి శాస్త్రంలో చెప్పాడు. వీరు ఎప్పుడు సంతోషంగా ఉండరు.. దుఃఖ పడుతూనే జీవితాన్ని గడిపేస్తారని అన్నారు. అసూయ విదుర నీతి ప్రకారం ఇతరుల పురోగతిని చూసి అసూయపడే వ్యక్తి తన జీవితంలో ఎప్పుడూ విచారంగా ఉంటాడు. ఈ రకమైన గుణం అంటే అసూయ గుణం వ్యక్తులకు ఆత్మవిశ్వాసం తక్కువగా ఉంటుంది. అసూయతో జీవించే వ్యక్తి అవతలి వ్యక్తిలో ప్రతికూలత ఆలోచనలను కూడా పెంచుతాడు. ద్వేషించే గుణం ద్వేషం లేదా అసహ్యం అనేది మిమ్మల్ని లోపలి నుంచి దహించి వేసే భావన . ఇతరుల పట్ల అకారణ ద్వేషం ఉన్న వ్యక్తి చివరికి ప్రతికూలత ను ఒంటరితనాన్ని ఎంచుకుంటాడు. అది తప్ప వీరికి మరేమీ మిగలదు. ఇతరులను ద్వేషించే వ్యక్తి తన దగ్గరి బంధువుల నుంచి కూడా దూరం అవుతాడు.

**గబ్బిలాల నుంచి వీటిని నేర్చుకుంటే.. జీవితంలో ఎప్పటికీ బాధపడరు.**

అసంతృప్తి జీవితంలో సంతోషంగా ఉండాలంటే ఉన్నదానితో సంతృప్తి చెందాలి. విదుర నీతి ప్రకారం తనకి ఉన్న దానితో సంతృప్తి చెందని వ్యక్తి ఎల్లప్పుడూ అసంతృప్తిగా ఉంటాడు. అలాంటి వారికి ఆనంద సాధనాలు ఉన్నప్పటికీ వారు ఎప్పుడూ సంతోషంగా ఉండరు.

**కోపం- అనుమానం**

కోపంగా ఉన్న వ్యక్తి జీవితంలో ఎప్పుడూ దుఃఖం ఉంటుందని మహాత్మా విదురుడు అన్నాడు. అధికంగా కోపం తెచ్చుకునే వ్యక్తి జీవితంలో సంబంధాలపై ప్రభావం చూపిస్తుంది. సంబంధాలను కూడా పాడు చేస్తుంది. ఇంకా విదుర నీతిలో ప్రతి చిన్న విషయాన్ని అనుమానించి, తన జీవితాన్ని నిత్యం సందేహంతో గడిపే వ్యక్తి జీవితం దుఃఖించడాంతోనే గడిచిపోతుందని చెప్పాడు. ఇతరులపై ఆధారపడి ఉండటం కష్టపడి పనిచేయడం ద్వారానే విజయం లభిస్తుంది. కష్టపడి పనిచేయడం మానేసి ఇతరులపై ఆధారపడే వ్యక్తికి సమాజంలో తగినంత గౌరవం లభించదు. అలాంటి వ్యక్తి ఎల్లప్పుడూ సంతోషంగా ఉండదు.